# గొర్రెల మంద

ఆ ఊళ్ళో నేను ఉద్యోగంలో చేరిన కొన్నాళ్ళకే వినయ్ నాకు మంచి ఫ్రెండయ్యాడు. ఆఫీసుకు దగ్గరగా ఉండే వాడి అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ ఖాళీ అవుతుందని చూసుకోవటానికి రమ్మంటే ఆ ఆదివారం వాళ్ళింటికి వెళ్ళాను. ఆ పని పూర్తయ్యాక ఇద్దరం బాల్కనీలో కూర్చుని టీ తాగుతున్నపుడు 'కొక్కొరోకో' అంటూ కోడిపుంజు అరుపు వినిపించింది. అలా నాలుగైదుసార్లు వినిపించేసరికి నేను ఆశ్చర్యంగా వింటోంటే, వినయ్ వివరంగా చెప్పాడు. ''ఈ టౌన్‌లో కోడి అరుపు వినబడటం ఆశ్చర్యంగా ఉందా? ఈ పక్క ఖాళీస్థలంలో ఇల్లు కడుతున్నారుగా, అక్కడి వాచ్‌మేన్ వాళ్ళ ఊరుకి వెళ్ళి ఈ మధ్య ఆ కోడిని తెచ్చాడట! ఎపుడంటే అపుడు అలా అరుస్తూ ఉంటుంది. పల్లెటూళ్ళలో అయితే మునుపు నిద్ర లేవటానికి రైతులు కొక్కొరోకో పిలుపుల్ని ఆధారం చేసుకునే వాళ్ళటకదూ! ఇపుడు బస్తీకి వచ్చిందిగా, దానికీ వేళాపాళా ఉన్నట్టు లేదు!'' అన్నాడు. చిరునవ్వుతో.

''పాపం ఆ కోడికి ఈ ఊరు నచ్చలేదని, తనను ఆ గ్రామానికే పంపించెయ్యమని వేడుకుంటోంది...!'' అన్నాను నేను.

దానికి వాడు చిన్నగా నవ్వి ''కోడి భాష బాగా తెలిసినట్లుగా చెబుతున్నావే'' అన్నాడు. నేనూ నవ్వు మొహంతో ''నిజంగానే నాకు తెలుసు!'' అనగానే ''కథ చెబుతున్నావా ఎవరైనా చిన్న పిల్లలకు చెప్పు... తేలిగ్గా నమ్మేస్తారేమో...!'' అన్నాడు కొంచెం వ్యంగ్యంగా.

''చిన్న పిల్లలే కాదు, వయసులో పెద్దవాళ్ళు కూడా నమ్మటం నేను చూసాను!'' అన్నాను.

''సరే... ఏదో కథ చెప్పబోతున్నావని అర్థం అయింది. సరే, కానీయ్ కాలక్షేపంగా ఉంటుంది! ఖాళీగానే ఉన్నాంగదా!'' అన్నాడు.

''కథ కాదుగానీ... నా హైస్కూలు రోజుల్లో జరిగిన ఒక సంఘటన చెబుతాను! అపుడు 'గొర్రెల మంద లాంటి జనం' అనే మాట ఎందుకు పుట్టిందో, నాకు అర్థమైంది...నీకూ కోడి భాష గురించీ తెలుస్తుంది!'' అంటూ చెప్పటం మొదలు పెట్టాను.

''మా నాన్న ఉద్యోగరీత్యా మేం చాలా ఊళ్ళే తిరిగాం. హైస్కూలు చదువు సాగుతున్న రోజుల్లో మేం పల్లెకాదు, పట్నమూ కాదన్నట్లుండే ఒక గ్రామంలో ఉండేవాళ్ళం. ఒకరోజు నాక్లాస్‌మేటు, క్లోజ్ ఫ్రెండ్ అయిన రమణ వచ్చి, ఆ మరునాడు వాళ్ళింట్లో వాళ్ళంతా జాతరకు పొరుగూరు వెళ్తున్నారనీ, పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి కాబట్టి తనను ఇంట్లో ఉండి చదువుకోమన్నారనే విషయం చెప్పి, వాళ్ళింటికి నేనూ వస్తే ఇద్దరం కలిసి కాసేపు చదువుకుంటూ, మరి కాసేపు కబుర్లు, ఆటపాటలతో కాలక్షేపం చేయొచ్చనీ చెప్పాడు, సరేనన్నాను.

అలా ఆ ఆదివారం వాళ్ళింట్లో సాయంకాలం వరకూ ఉండటానికి సిద్ధపడే వెళ్ళాను. వాళ్ళ అమ్మగారు చేసిపెట్టినదేదో మేం తింటూండగా వాళ్ళ బాబాయ్ వాళ్ళింట్లో ఆవులు, గేదెల్ని మేపుకు వచ్చే పాలేరు 'పాలు ఇక్కడ పెట్టా... తీసుకో బాబూ...' అని కేక పెట్టి వెళ్ళిపోయాడు. మేం బయటకు వచ్చేసరికి రమణ వాళ్ళింట్లో పెరిగే కోడిపెట్ట ఆ పాలగిన్ని మీద కూర్చుని ఉంది. వాడు అదిలించే సరికి ఎగిరి నీళ్ళ గాబు దగ్గరికి వెళ్ళి నీళ్ళలో పడింది! 'అయ్యయ్యో' అంటూ రమణ దాన్ని నీళ్ళ నుండి తీసి వాళ్ళమ్మ పాతచీరతో తుడిచి దానితోనే చుట్టబెట్టి ఒళ్ళో పెట్టుకుని అరుగుమీద కూర్చున్నాడు.

ఇక్కడ ఆ కోడి గురించి చెప్పాలి. అదేమిటోగానీ రమణ ఇంట్లో ఉన్నంతసేపూ ఆ కోడి వాడి వెంటే తిరుగుతూ ఉండేది. ఆఖరుకు వాడు చదువుకుంటున్నపుడూ కూడా పక్కనే కూర్చుని చూస్తూ ఉంటుందట! ఈ విషయం నాకు కొంచెం విచిత్రంగానే అనిపించేది! రమణ కూడా దాన్ని ఒళ్ళో కూర్చోబెట్టుకుని తనకు తోచిన కబుర్లన్నీ చెబుతూ ఉండటం ఇంకా ఆశ్చర్యంగా ఉండేది! ఆ మాట వాడితో అంటే, వాడు కూడా 'ఏమోరా... నాకిలా అలవాటైపోయింది! నా మాటలు దానికి అర్థమైనట్లే... 'కొక్కొరొకో' భాషలో ఏమిటో చెబుతుంటుంది! నేనూ అర్థమైనట్లు తలవూపుతూంటా' అంటూ నవ్వేసాడు. అపుడు కూడా అంతే. 'అనవసరంగా నిన్ను నీళ్ళల్లో పడేట్లు చేశాను... చలేస్తోందా' అంటూ ఏవేవో కబుర్లు చెబుతున్నాడు. సరిగ్గా అపుడు వాళ్ళింటి మీదుగా ఎక్కడికో వెళ్తోన్న ఒక పెద్దాయన రమణను చూస్తూ ''ఏంట్రా... మీ పెట్ట పైటేసిందీ..." అని మళ్ళీ నవ్వుతూనే 'గుడ్లు పెడుతుందా...?' అనడిగాడు. వేళాకోళంగానే రమణకూడా 'లేదు... పాలు ఇస్తుంది!' అన్నాడు. 'కోడి గుడ్లు పెట్టక పాలు ఇస్తుందా' అనే వెటకారం ఆ పెద్దమనిషికి అర్థం అయిందో లేదో గానీ 'నిజమా...?' అంటూ ఆశ్చర్యంగా చూశాడు.

రమణ కూడా 'అవును...' అంటూ అక్కడే అరుగు మీద పెట్టిన పాలగిన్నెను చూపించాడు. ఆయన ఏ మాత్రం ఆలోచన లేకుండా 'ఇదేమి విచిత్రం....!' అంటూ నోరు తెరిచేశాడు! అసలు విషయం ఏమిటంటే... వాళ్ళ బాబాయ్ వాళ్ళు కూడా అంతా జాతరకు వెళ్తున్నారు కాబట్టి వాడుకల వాళ్ళగా ఇవ్వగా మిగిలిన పాలను రమణా వాళ్ళింట్లో ఇవ్వమని చెప్పటంతో అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు పాలేరు.

ఇదేమీ తెలియని పెద్దమనిషి రమణ వేళాకోళంగా చెప్పిన మాటను ఇట్టే నమ్మేశాడు! పైగా 'ఆ మధ్య గణపతి చాలా చోట్ల పాలు తాగుతున్నాడనే విడ్డూరం విన్నామా, ఇపుడు మన ఊరి అమ్మవారు... మీ కోడిపెట్ట మీదకి వచ్చి ఇలా మహిమ చూపిస్తుందన్నమాట! ఇంత మహిమ మన ఊళ్ళోనే కనబడుతుంటే... పొరుగూరు జాతరకి పోవటమెందుకూ... కొంతమందికయినా ఈ విడ్డూరం చెప్పాలి...' అంటూ హడావుడిగా వెళ్లిపోతుంటే, రమణ అపుడు అసలు విషయం చెబుదామని కాబోలు 'సుబ్బన్న తాతా.. ఒక నిమిషం ఆగు...' అంటూ పిలిచాడు.

కానీ ఆయన ఆ పిలుపును చెవిన పెట్టకుండా 'కలికాలంలో ఇలాంటి విచిత్రాలన్నీ జరుగుతాయని వీర బ్రహ్మంగారెప్పుడో చెప్పారు.... ఇప్పుడు కళ్ళారా చూస్తున్నాం. నలుగురికీ  ఈ విడ్డూరం చెప్పాలి గందా...' అంటూ వెళ్ళిపోయాడు!

మేం ఇద్దరం ఆయన హడావుడికి నవ్వుకుంటూ లోపలకు వెళ్ళిపోయాం.. పాలగిన్నెను పట్టుకుని. కాసేపటికి ఏదో కలకలం వినిపించి ఇద్దరం బయటకు వచ్చాం.

బయట చూస్తే ఏం ఉందీ... ఊళ్ళోని జనం చాలామందే నిలబడి ఉన్నారు! మేం కంగారుగా విషయం ఏమిటని అడగబోతుంటే... వాళ్ళ అరుపుల్ని బట్టి మాకే విషయం ఏమిటో అర్థమైపోయింది!

''అమ్మా... కుక్కుటమ్మ తల్లీ.... నీ మహిమా ఇలా చూపించావా... మా ఊరుని చల్లగా కాపాడు తల్లీ...!' అంటూ అరుస్తూ దండాలు పెట్టారు, రమణ చేతుల్లో ఉన్న కోడిని చూసి.  మేం నిర్ఘాంతపోయాం! మేం అపుడు అసలు విషయం చెప్పే ప్రయోజనం లేదనిపించింది! అంతగా మార్పు వచ్చేసింది!

ఆ సుబ్బన్న తాత నన్ను చూస్తూనే 'అలా నిలబడ్డావేంట్రా... ఆ పాలగిన్నె నేను చూసింది... తెచ్చి బయటపెట్టూ... ఈళ్ళంతా కూడా చూస్తారు...!' అన్నాడు గదమాయింపుగా.

పరిస్థితి మా చేయి దాటిపోయిందనే సంగతి తెలిసింది! చేసేదేం లేక లోపలకు వెళ్ళి ఆ గిన్నెను తెచ్చి బయట అరుగుమీద పెట్టాను. వాళ్ళంతా లైనుగా నిలబడి వచ్చి తలా ఒక చెంచా తీర్థం లా నోట్లో పోసుకున్నారు! పైగా వాళ్ళల్లో వాళ్ళు రకరకాలుగా చెప్పుకోవటమూ వినిపించింది!

'ఇలాంటి మహిమగల కోడిపాలు తాగితే ఒంట్లో ఉన్న జబ్బులన్నీ ఇట్టే ఎగిరిపోతాయటా...!'

'మరి... ఏ జబ్బులూ లేనివాళ్ళు తాగితేనో...?' ఇంకొకరి సందేహం.

'ఏంటా మాటలు...? ఆ మాత్రం తెలియదా... ఇక ముందు ఏ జబ్బులూ రాకుండా ఉంటాయి!' ఇది మరొకరి గదమాయింపుతో కూడిన సమాధానం!

'అవున్నిజమే...'

'అసలు అపనమ్మకం ఉన్నవాళ్ళు రానేకూడదు! అపచారం మాటలు వద్దు. తల్లికి ఆగ్రహం వస్తుంది!' ఇంకొకరు చెంపలు వేసుకున్నట్లుగా గదమాయింపు!

రమణ పరిహాసంగా చెప్పిన ఒక మాట ఇంత ప్రభావం చూపించటేమిటో...! ఎవరూ ఎటువంటి సందేహం లేకుండా... ఒకరిని అనుసరించి మరొకరు, ఒకరిని మించి ఇంకొకరుగా భక్తి భావ ప్రదర్శన...! ఎంత విచిత్రం! నాలో నేను విస్తుపోయాను!

రమణ పరిస్థితీ అలాగే ఉంది. ఏం చేయాలో తోచక వాళ్ళు చెప్పినది వింటూ ఉండిపోవటమే అనుకున్నాం.

ఇంతలో... మా ఊళ్ళో షామియానాలు, మైకుసెట్లూ లాంటివి అద్దెకు ఇచ్చే జగ్గారావు తన ఇద్దరు పనివాళ్ళతో దిగిపోయాడు, ఎందుకు, ఏమిటి అనడిగితే, నవ్వుతూ జవాబు చెప్పాడు.

'అలా అడుగుతారేంటండీ... మన ఊళ్ళో సగం మంది జాతరకు పొరుగూరు వెళ్ళారు కాబట్టి సరిపోయింది. అయినా ఇంకా ఉన్నారు గదండీ... చాలామంది కుక్కుటమ్మ తల్లికి సమర్పించుకోవటానికి పళ్ళు, కొబ్బరికాయలూ, కానుకలూ అట్టుకొస్తామన్నారు! మరి ఆళ్ళందరూ కూర్చుని భజనలూ గట్రా చేసుకుంటారా ..ఎండలో మాడిపోకుండా. నాకూ రవంత పున్నెం దక్కుతుందనీ...' అంటూనే గొంతు కొంచెం తగ్గించి చెప్పాడు 'ఏమో... తల్లి దయవల్ల... ఇది నా బిజినెస్‌కి ప్రచారంగా కూడా ఉపయోగపడి, చుట్టుపక్కల ఊళ్ళలోనూ బ్రాంచీలు తెరవగలనేమో... ఎవరు చెప్పగలరూ...!'

'అమ్మో... జగ్గారావూ... నీదెంత ముందుచూపు...!' అంటూ ముక్కున వేలేసుకుని మరీ విస్తుపోయాం...!

'పాపం.... పిల్లలే ఉన్నారింట్లో... ఏర్పాట్లూ గట్రా చూసుకోవటానికి పెద్దోళ్ళెవరూ లేరుకదా... మనమే అన్నీ చక్కబెట్టుకోవాలి...!' అంటూ కొందరు తీర్మానించి పనులకు నడుం బిగించారు.

రమణ వాళ్ళిల్లు ఊరుకు కొంచెం దూరంగా ఉంటుంది. వాళ్ళిల్లు ఎదురుగా ఖాళీ ప్రదేశమే. అది బాగా కలిసి వచ్చింది. ఇంటిముందు దారికి ఎదురుగా వేసిన షామియానా నీడలో జంబుఖానాలు పరిచి అందరూ కూర్చుని ఎవరికి తోచినవి వాళ్ళు పాటలు కొందరు పాడుకుంటుంటే, మరికొందరు కబుర్లు మొదలు పెట్టారు.

ఎవరో మితిమీరిన భక్తి ప్రవత్తులున్నవాళ్ళు కాబోలు ప్రసాదం అంటూ పంచిపెట్టటానికి, పులిహోర, దద్దోజనం, చిన్న చిన్న విస్తరాకులు వగైరాలు తీసుకువస్తే, కొందరు కుర్రాళ్ళు... అందరికీ అందించే పని పెట్టుకున్నారు!

ఇంకా విచిత్రం ఏమిటంటే... రమణ వాళ్ళింట్లోని ఖాళీ గంగాళాన్ని తీసుకువచ్చి ఒకరు ఆ అరుగుమీద పెట్టారు...! అంటే... వచ్చినవాళ్ళు ఏవో కోరికలు మొక్కుకుని దక్షిణగా డబ్బులు వేయటానికట!!

నేనూ త ప్పేదేం లేదనుకుంటూ, వాళ్ళ మధ్యలో తిరుగుతూ మంచినీళ్ళు అందించే పనిలోకి దిగాను! అలా తిరుగుతూంటే ఆడవాళ్ళ కబుర్లు విని లోలోపల నవ్వుకున్నాను! మచ్చుకు కొన్ని జ్ఞాపకం ఉన్నవి చెబుతాను.

'లీల ఇంకా రాలేదేమిటే సుబ్బులూ...?'

'వాళ్ల పెద్దమ్మకి కబురు చెప్పి వస్తానంది.. ఆళ్ళిల్లు కొంచెం దూరం కదా, ఏదైనా చెప్పకపోతే 'నాకు సెప్పకుండానే మీరంతా బయలెల్లిపోనారా' అని నిష్ఠూరం వస్తుందని లీలక్కకి భయం!'

'అవును గానీ... కనకం కూడా కనిపించటం లేదేమిటి...?'

'ఆవిడ అడుగు బయటపెట్టాలంటే... ముకం మీద సగం సబ్బు కరిగిపోవాలిగదా.. అదీ ఆలీసెం...' ఒకావిడ ఎకసెక్కం చేసింది.

ఇంకొకావిడ వెంటనే అందుకుంది 'అసలు విషయం అది అయితే, అందరితో ఏం చెబుతోందో తెలుసా.. 'తలుపులికి తాళాలు పెట్టేసి మీలా పరుగెత్తుకు రావడం నాకెలా కుదురుతుందీ... అత్తగారికీ, మావగారికీ సేవలు చేసి, పనులన్నీ చక్కబెట్టుకుని రావాలి మరీ!' అంటుంది! అంటూ ఇంకొకామె నవ్వింది. కొంతమంది పెద్దగా నవ్వుతుంటే... ఒకావిడ 'ఇక వూరుకోండి... అదిగో కనకం వస్తోంది!' అని హెచ్చరించింది!

ఆ కనకాన్ని ఎవరో అడగనే అడిగారు ఏమిటీ ఆలశ్యం అని!

సరిగ్గా కనకం అనబడే ఆవిడ ఎవరో ఆవిడ చెప్పిన జవాబును అలాగే చెప్పింది! దాంతో కొందరు మెల్లగానే కిసుక్కుమన్నారు!

కనకం కొంచెం కోపంగా వాళ్ళవైపు చూసి 'ఎందుకే మీరంతా నవ్వులొలకబోస్తున్నారూ?' అనడిగింది!

ఇందాకనే 'అమ్మాజీ అత్త నువ్వు చెప్పినదే నీ గురించి చెప్పిందిలే...' మెల్లగా గొణిగారు.

అదేం పట్టించుకోనట్లుగా ఆవిడ 'ఏటీ ఈ వేళ ఈ విశేషం...' అంటూ ఆరాలు మొదలు పెట్టింది!

ఇక మగవాళ్ళల్లో ఇంకో రకం మాటలు.

'డబ్బు చాలానే పోగవుతుంది... ఏం చేద్దారీ?'

'ఈ వీధి చివర ఖాళీ జాగా ఉంది. అక్కడ ఇంకొంత డబ్బు చందాలుగా వసూలు చేసి 'కుక్కుటాలయం' అనే పేరుతో గుడి కడితే సరి!'

'అంటే... ఆ జాగా నీదే కందా... సరైన బేరం రాటంలేదంటూ మొన్న ఎవురికో సెబుతుంటే ఇన్నా... ఇప్పుడు బాగా చెల్లిపోతుందని ఆలోచన చేసావా?'

'మంచికి పోతే చెడు ఎదురవతుందని అన్నారు! ఏదో మనవూరికీ ఓ గుడి అని తక్కువ రేటుకే నా స్థలం ఇద్దామనుకుంటే... ఇలా అంటున్నారా...?' కోపంతో రెచ్చిపోయాడతను.

ఇలా సాగిపోతున్నాయి రకరకాలుగా వాళ్ళమాటలు!

బెల్లం చుట్టూ ఈగలు ముసురుతాయని సామెత. మనష్యులు పోగయితే, సోడా బళ్ళ వాళ్ళూ, రకరకాల చిరుతిండ్లు అమ్మేవాళ్ళూకూడా అక్కడకు చేరిపోయారు! గుడి గానీ కడితే, వాళ్ళ బేరసారాలూ బావుంటాయని ఆ చిరువ్యాపారాల ఆశ!

సాయంకాలం కాగానే అంతా సర్దుకుని ఇళ్ళకు చేరటానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు! రమణ మొహంలోకి కొంచెం రిలీఫ్ కనబడింది! అప్పటివరకూ ఇంత గందరగోళాన్ని చేజేతులా రప్పించానంటూ మధనపడుతున్నాడు మరి! నాతో వీలు చూసుకుని ఆ మాట మెల్లిగా చెప్పాడు కూడా. 'మా అమ్మవాళ్ళు వచ్చే వేళ కూడా అవుతోంది... జాతరకి మనం వెళ్ళి చూసి రావటం బావుంటుంది గానీ, ఇంట్లోకే జాతర వచ్చి

కూర్చుంటే ఎలా భరించగలంరా... అంటూ చివాట్లు పెడితే ఏం చెప్పాలి!' అంటూ తలపట్టుకున్నాడు. నాకు తోచిన సమాధానం ఏదో చెప్పి కాసేపు ఓపికపట్టమని ఓదార్చాను.

అందరూ లేచి వెళ్ళిపోతోంటే, ఆ గోలలోనే ఒకావిడ రమణ దగ్గరకు వచ్చి 'ఒరేయ్... నేను చాలా ఆలీసంగా వచ్చాను. రేపు కూడా మీకోడి పాలు ఇస్తదా... ఏ వేళకో చెప్పు... నేనూ చూసి, కొంచెం నోట్లో పోసుకుని వెళ్తాను!' అనడిగింది.

గుండెలో రాయి పడ్డట్టుగా ఓ క్షణం బిత్తర చూపులు చూసిన రమణ ఒక క్షణంలోనే తేరుకుని నవ్వు మొహం పెట్టాడు!

'ఏంటత్తా అలా అడుగుతున్నావ్...! నువ్వు నీ పిల్లాడికి పాలిచ్చేటపుడు... పైటచాటు చేసుకుంటావుగానీ నలుగురి ముందూ ఇవ్వవు కదా... అలాగే మా పెట్టాను, అందరూ చూస్తుండగా ఎందుకిస్తదీ..? నేనూ చూళ్ళేదు. గిన్నె మీద కూర్చుని ఉంటే, అదిలించాను.. అపుడు చూస్తే గిన్నె నిండా పాలు ఉన్నాయి.. అంతే...!' అన్నాడు సగం నిజం.. సగం కల్పన కలిపి.

'భలేవాడివిరా... నువ్వు!' అంటూ ఆవిడ పెద్దగా నవ్వేసింది.

ఎందుకోగానీ, ఆ కోడి అప్పుడు నాలుగైదుసార్లు పెద్దగా అరిచింది. 'కొక్కొరోకో' అంటూ.

ఒకాయన రమణతో 'రోజూ నువ్వే ఆ కోడిపెట్టతో కబుర్లు చెబుతావంట. ఇపుడేమందో చెప్పరా... నీకూ ఆ కోడి భాష వచ్చేవుంటదిగా...' అన్నాడు నిజంగానో, మరి వెటకారంగానో.

రమణ తెలివిగా తప్పించుకునే ఉపాయంతో జవాబు చెప్పాడు. 'అవును బాబాయ్.. కొంచెం కొంచెం కోడి భాష నాకూ వచ్చేసింది. రేపటినుండీ ఎవరి పనులు వాళ్ళు చేసుకుందాం. నా పని నేను గుడ్లు పెట్టటమే చేస్తానూ.. అంటోంది...!'.

ఆయన 'అవునా' అంటూ విస్తుపోతూ కదిలాడు.

ఇంకొకాయన ఆ డబ్బు అంతా ఏం చేద్దామని అడిగాడు. గుడికట్టే ఆలోచన ఊరివాళ్ళందరిదీనూ అని కూడా అన్నాడు.

' పిల్లలమంతా మా బడిలో ఓ లైబ్రేరి ఏర్పాటు కోసం ఇవ్వాలనుకుంటున్నామండీ... ఇపుడే అందరి ముందూ లెక్కకట్టి హెడ్మాష్టరు గారికి ఇస్తాం...!' అని రమణ చెప్పగానే కోడి ఇంకోసారి పెద్దగా అరిచింది.

రమణ నవ్వుతూ 'మాకోడి తల్లి కూడా అనుమతించేసిందండీ!' అన్నాడు. ఆయన ఇంకేమనలగడూ.. తల వూపాడు!

అనుకున్నట్లే ఆ పనీ పూర్తయినాక, నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు. ఆ తరువాత రమణ నాతో రహస్యంగా చెప్పాడు. వాడి కోడికి ఓ అలవాటు ఉందట. దాని కాలును నిమరగానే పెద్దగా 'కొక్కొరోకో' అని అరుస్తుందట! వాడదే చేసి కోడి భాషని అనువదించినట్లుగా చెప్పాడన్న మాట!

ఇదీ విషయం! అంటూ ముగించాను. ''ఆ రోజే నాకు గొర్రెల మంద, వేలం వెర్రి లాంటి పదాలకు అర్థం తెలిసింది!'' అంటూ వినయ్ వైపు చూశాను.

''నిజమే... మనలో చాలామందికి నిజానిజాల కంటె.. సంచలనం విషయాలపట్ల ఆసక్తి ఉంటుంది! చాలాసార్లు ఈ విషయాన్ని నేనూ గమనించాను! పిల్లలూ, పెద్దలూ, చదువుకున్నవాళ్ళు, చదువులేనివాళ్ళూ అనే తేడా కూడా లేకుండా కొందరు గొర్రెల్లాగే ప్రవర్తిస్తారనేదీ నిజమే..!'' అన్నాడు చిరునవ్వుతో.

* * *